క్లుప్తంగా

జగన్మోహిని అవతారంలో శ్రీ లక్ష్మీ జనార్ధనస్వామి

రామసముద్రం : స్థానికంగా వెలిసిన శ్రీ లక్ష్మీ జనార్ధనస్వామి రథోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు పార్థసారధి బట్టర్, కులశేఖర్‌లు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి తోమాల సేవ చేసి విశేష అలంకరణ చేశారు. రాత్రి అన్నమాచార్య సంకీర్తన సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల కలయిక



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ : 24 ఏళ్ల క్రితం పదో తరగతి స్థానిక హోప్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. సోమవారం స్థానిక హోప్ పాఠశాలలో 2001–2002లో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పట్లో పాఠశాల్లో చదువుకున్న రోజులు గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల ఆశీస్సులు తీసుకున్నారు. అందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నీతకుమారి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సుగుణమ్మ, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

15న మండల సమావేశం

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అధ్యక్షతన అనసూయమ్మ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, మండల ఉపాధ్యక్షులు, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : జూదం ఆడుతున్న ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పీవీ రమణ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం గ్రామం చెరువుకింద పల్లె వద్ద జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో చెరువుకిందపల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి రూ. 18 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు చేసినా, జూదం నిర్వహించే వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

రామసముద్రం ఏపీఓగా మాధవి



రామసముద్రం : రామసముద్రం మండలం ఉపాధి హామీ పథకం ఏపీఓగా మాధవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏపీఓగా పనిచేస్తున్న గౌరీశంకర్ వి.కోట మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో చిన్నమండ్యంలో పనిచేస్తున్న మాధవి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని, ఉపాధి పథకంలో కూలీలకు సకాలంలో పనులు కల్పిస్తామన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

మదనపల్లె సిటీ : విద్యార్థినులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సోషియల్ ఆర్గనైజర్ జయశ్రీ తెలిపారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం రుతుక్రమంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఎలాంటి శానిటరీ ప్యాడ్స్ వాడాలి, పరిశుభ్రత ఎలా పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

పరామర్శ

కలికిరి : మండలంలోని చీకటిపల్లి పంచాయతీ రంగనాథపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.లక్ష్మన్న అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను సోమవారం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ డా. సురేంద్రనాథరెడ్డి, నాయకులు మహేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, రామలింగేశ్వరయ్య, రామక్రిష్ణారెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కేవీపల్లె : పదో తరగతి విద్యార్థులు యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లు సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. సోమవారం మండలంలోని గ్యారంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్‌పేపర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బి. చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యం.. శత శాతం

- పదో తరగతిపై శ్రద్ధతో బోధన
- మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణ



వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం. ఇక్కడి నుంచే విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం ప్రారంభమవుతుంది. తమ పిల్లాడు పదో తరగతి దాటేస్తే చాలు ఎలాగైనా బతికేస్తాడు అని పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు కల కంటారు. విద్యార్థి పదో తరగతి తర్వాత తమకిష్టమైన కోర్సు చదవాలంటే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలి. అత్యధిక మార్కుల సాధన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. అందుకే పదిలో తమ ప్రతిభ చాటేందుకు విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. ఇందు కోసం మదనపల్లె మున్సిపాలిటీలో ఆరు ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో ఈ ఏడాది 723 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పది పరీక్షల్లో మంచి ఫలితాల కోసం కసరత్తు చేస్తున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో రాష్ట్రంలో మదనపల్లె మున్సిపాలిటీ గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానం దక్కించుకుంటుంది. వివేకానంద మున్సిపల్ పాఠశాల(రాంరెడ్డి లేవట్)కు చెందిన విద్యార్థులు గత ఏడాది 550 మార్కులు 13 మందికి, 500కు పైగా 30 మంది సాధించి జిల్లాలోనే మొదటి స్థానం దక్కించుకుంటున్నారు. ప్రతి ఏడాది మంచి మార్కులు సాధిస్తున్నారు.

స్టడీ అవర్లతో పర్యవేక్షణ

మున్సిపల్ పాఠశాలల్లో రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీసీఈబీ ఇచ్చిన పేపర్లతో ప్రతి వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక తరగతులు

జిల్లా విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల ప్రణాళికను హైస్కూళ్లలో పక్కగా అమలు చేస్తున్నారు. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి తరగతుల్లో ప్రత్యేక సాధన చేయిస్తున్నారు. ఆదివారం, పబ్లిక్ హాలిడేస్‌లలో కూడా తరగతులు నిర్వహిస్తున్నారు.

మదనపల్లె మున్సిపాలిటీలో ఉన్నత పాఠశాలు పది విద్యార్థులు	
బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల	79
హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాల	183
ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాల	71
నెహ్రు మున్సిపల్ ఉన్నత పాఠశాలల	51
వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (మాయబజార్)	86
వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (రామిరెడ్డి లేవుట్)	253

పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ



పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇందుకు ఉపాధ్యాయులు అందరూ కలిసి కష్టపడి పనిచేస్తున్నారు. పది విద్యార్థులపై మొదటి నుంచి ఫోకస్ చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఈ ఏడాది కూడా మంచి ఫలితాలు సాధించి మున్సిపల్ పాఠశాలల్లో టాప్‌గా నిలుస్తాం.

–వెంకటరమణ, హెచ్‌ఎం వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

మదనపల్లె సిటీ : మండలంలోని సీటీఎం రైల్వే గేట్ వద్ద వెలసిన హజరత్ సయ్యద్ నాదర్ షాహ్ వలీ దర్గా ఉరుసు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. తహలీల్‌ఫాతెహా నిర్వహించి ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముకాన్‌దార్ జాఫర్‌వల్లి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12న జ్యోతీ ప్రజ్వలన

కురబలకోట : గుర్రంకొండ – గాలివీడు మార్గంలోని శ్రీ వారాహి హనుమ ఆధ్యాత్మిక మహేంద్ర మఠ్రి ఆశ్రమంలో బుధవారం జ్యోతీ ప్రజ్వలన కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నట్లు శివమాల పీఠాధిపతులు, మహేంద్ర మఠ్రి స్థాపకులు శ్రీ చింతిర్ల మల్లిఖార్జున స్వామి తెలిపారు. సోమవారం ఆయన అంగళ్లులో మాట్లాడుతూ మహేంద్ర మఠ్రి వద్ద ఉదయం నుంచి సప్త యజ్ఞములు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం వరకు సత్సంగం నిర్వహించడం జరుగుతుందన్నారు. రోజంతా అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు. అనంతపురం జిల్లాకు చెందిన బృందం వారి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. పౌర్ణమిని పురస్కరించుకుని ప్రజల సంకల్పాలు నెరవేరుటకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతతను ఇచ్చే ఆయుధం ధ్యానం



ధ్యాన కేంద్రం ప్రారంభంలో శ్రీ జ్ఞానానంద స్వామి దంపతులు

కురబలకోట : ధ్యానంతో ఆరోగ్యం తద్వారా ఆనందం సాధ్యమని శ్రీ జ్ఞానానంద స్వామి పేర్కొన్నారు. కడప క్రాస్ దగ్గర సద్దికూటి హరినాథ్, సద్దికూటి దామోదర్ కుటుంబీకుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబడిన అచల సద్గురు సేవా నిలయం (అచలార క్షేత్రం–2)ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంత సేపు సామూహిక ధ్యానం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శరీరం, మనసు, ఆత్మల సమతుల్యత మీదనే సంపూర్ణ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ప్రకృతికి అనుగుణంగా నడవాలన్నారు. ధ్యానంతో ఒత్తిడి ఆందోళన తగ్గుతుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు వివిధ రోగాలు నియంత్రణలోకి వస్తాయన్నారు. ఏకాగ్రతను, జ్ఞాపక శక్తిని పెంచుతుందన్నారు. ప్రశాంతతను ఇచ్చే ఆయుధంగా ధ్యానం పని చేస్తుందన్నారు. సాధన వల్ల ధ్యానం చేయడం సులభమన్నారు. జీవితంలో ముందుకు సాగడానికి ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో వకుళాదేవి, సద్దికూట సుబ్బన్న, ఎస్.శ్రీనివాసులు, సుగుణమ్మ, ఎస్.లక్ష్మిదేవి, దేవిశ్రీ, మహర్షి తదితరులతోపాటు వివిధ గ్రామాల వారు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగిని ఇబ్బందులకు గురిచేయవద్దు

మదనపల్లె : టీడీపీ నాయకుల ఆధిపత్యపోరులో గిరిజన ఉద్యోగిని ఇబ్బందులకు గురిచేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు వెనుకాడమని ఏపీ గిరిజన సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు బుక్కా హరికృష్ణనాయక్ హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్‌లో మట్టి తరలిస్తున్న టిప్పర్ లారీ తాళాలను డ్రైవర్ నుంచి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా లాక్కుని, గ్రామ వీఆర్వో అయిన గిరిజన ఉద్యోగి మునస్వామినాయక్‌కు అప్పగించారన్నారు. తర్వాత టీడీపీ తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, అక్కడకు వెళ్లి అతడిని బెదిరించి లారీ తాళాలు తీసుకుని, టిప్పర్‌ను తీసుకువెళ్లి పోయారన్నారు. ఇదిలాఉంటే... టీడీపీ నాయకులు ఇద్దరూ తమ ఆధిపత్య పోరులో భాగంగా వీఆర్వో మునస్వామి నాయక్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌లో శ్రీరామ్‌చినబాబుపై కేసు నమోదుచేయాల్సిందిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వీఆర్వో మునస్వామినాయక్‌పై ఒత్తిడి చేస్తే, కేసును వెనక్కు తీసుకోవాలని తెలుగుయువత అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఎమ్మెల్యే, తెలుగుయువత అధ్యక్షుడి ఒత్తిడితో గిరిజన ఉద్యోగి, వీఆర్వో మునస్వామినాయక్ కుటుంబం ఒత్తిడితో సతమతమవుతోందన్నారు. ఇద్దరిలో ఎవరిని కాదనుకున్నా, తమ ఉద్యోగం ఏమవుతుందో అన్న ఆందోళన వారికి కలుగుతోందన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి సారూ..!

- పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్‌కు బంగారుకొత్తపేట వాసుల వినతి
- భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్న కౌలుదారు



దారిసమస్యను సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వివరిస్తున్న బంగారుకొత్తపేట కాలనీవాసులు

మదనపల్లె : మండలంలోని పొన్నూటిపాళ్యం పంచాయతీ బంగారు కొత్తపేటలో దారి సమస్యను పరిష్కరించి పుణ్యం కట్టుకోండి అయ్యా.. అంటూ కాలనీవాసులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా బంగారుకొత్తపేట కాలనీ వాసులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా తాము వినియోగిస్తున్న దారిని కొందరు కబ్జాచేసి, అక్రమనిర్మాణాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు వినతులు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ భూమిని కౌలుకు ఇస్తే తప్పుడు రికార్డులతో కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై న్యాయపోరాటం చేసి భూమిని స్వాధీనం చేసుకుంటే, భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని బాధిత మహిళ లక్ష్మమ్మ కుమార్తె లలిత సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రామసముద్రం మండలం నారిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లెలో తన తండ్రి వెంకటరమణరాజు పేరు మీద సర్వేనెంబర్.218/1సీలో ఉన్నటువంటి భూమిని అదే గ్రామానికి చెందిన సురేంద్ర రాజుకు కౌలుకు ఇచ్చామన్నారు. తమ తండ్రి మరణాంతరం కౌలుకు తీసుకున్న వ్యక్తులు భూమిని కాజేసేందుకు పన్నాగం పన్ని తప్పుడు రికార్డులతో కబ్జా చేసేందుకు ప్రయత్నించారన్నారు. దీంతో తాము తమవద్ద ఉన్నటువంటి రికార్డులను అధికారులకు చూపిస్తే, భూమి స్వాధీనానికి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. రెవెన్యూ అధికారులు దగ్గరుండి భూమిని స్వాధీనంచేస్తే, ప్రస్తుతం భూమిలోకి రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. పోలీస్ రక్షణ కల్పించి, తమ భూమిని స్వాధీనం చేయాల్సిందిగా సబ్ కలెక్టర్‌ను కోరారు.

పీజీఆర్ఎస్ అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి..

మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పీజీఆర్ఎస్ అర్జీలు 55శాతానికి పైగా పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత శాఖల అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పరిష్కారానికి కృషిచేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

పెద్దతిప్పసముద్రం : ఆరోగ్యపరంగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు పురుషోత్తం నాయక్, శంకర్, యస్దానీలు ప్రజలకు సూచించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కందుకూరు, పీటీఎం పీహెచ్‌సీ పరిధుల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీల్లో చదువుతున్న పిల్లలకు వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రామసముద్రం : కడుపులో ఉన్న నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగాలని వైద్యాధికారి డాక్టర్ లీల తెలిపారు. సోమవారం కేసీపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జయరాం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ, బీకేఎంయూ నాయకులు

మదనపల్లె : ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలను ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని మదనపల్లి, తంబళ్లపల్లె నియోజకవర్గాల భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బికేఎంయూ జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, తంబళ్లపల్లె, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు, నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్న ఇప్పటివరకు ఒక ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. టీడీపీ నాయకులు తమ పార్టీ సభ్యత్వం తీసుకున్న వాళ్లకు, కార్యకర్తలకు మాత్రమే ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పుకుంటూ, అర్హులైన గ్రామీణ పేదలకు ఇళ్లను దూరం చేస్తున్నారని ఆరోపణ చేశారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని, ఇదివరకే సీపీఐ ఆధ్వర్యంలో వేల అర్జీలను ఎంఆర్ఓ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ఇచ్చామన్నారు. వీటిపై విచారణ చేసి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సచివాలయాలపై కూటమి నాయకుల పెత్తనం ఆపాలని, నిరుపేదలు సచివాలయాలకు స్వేచ్ఛగా వెళ్లి అర్జీలు ఇచ్చుకునే అవకాశం కల్పించాలన్నారు. సచివాలయాలపై రాజకీయాలు చేయవద్దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8వ విడత భూ పంపిణీ నిర్వహించినప్పటికీ మదనపల్లి తంబళ్లపల్లె నియోజకవర్గాలలో జరగలేదన్నారు. తక్షణమే రెండు నియోజకవర్గాల్లో 8వ విడత భూ పంపిణీ చేపట్టి, అర్హులైన నిరుపేదలందరికీ రెండు ఎకరాలు వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ములకలచెరువు మండల కార్యదర్శి అంజనప్ప పాల్గొన్నారు.

రైతులు ఏపీఎఫ్ఆర్ నమోదు చేసుకోవాలి

మదనపల్లె : మండలంలోని రైతులు ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ(ఏపీఎఫ్ఆర్) పోర్టల్‌లో తమ పేర్లను నమోదుచేసుకుని ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలని వ్యవసాయాధికారి నాగప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా పట్టాదారుల రైతుల వివరాలను ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదుచేస్తున్నామన్నారు.

రైతుల ఏపీఎఫ్ఆర్ సంఖ్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే వివిధ సంక్షేమ పథకాలు, పీఎం–కిసాన్, ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, విత్తనాలు, సూక్ష్మసేద్యం, రైతురుణాల మంజూరు తదితరాలకు అనుసంధానం చేస్తామన్నారు. దీని కోసం రైతులు తమకు సంబంధించిన 1బి, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానం కలిగిన మొబైల్ ఫోన్‌ను తీసుకుని, గ్రామంలోని రైతుసేవాకేంద్రం సిబ్బందిని కలవాలన్నారు. ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ కోసం రైతు స్వయంగా వచ్చి ఆధార్ ఈకేవైసీ ద్వారా పోర్టల్‌లో నమోదుచేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రైతులు 'ఫార్మర్ రిజిస్ట్రీ'లో నమోదుచేసుకోవాలి

నిమ్మనపల్లె : భూమి కలిగిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదుచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదుచేసుకున్న ప్రతిరైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటబీమా, పంటరుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు తదితర పథకాలను ప్రభుత్వం నుంచి పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. రైతులు సంబంధిత రైతు సేవాకేంద్రంలో సంప్రదించి పోర్టల్‌లో రిజిస్ట్రీ చేయించుకుని ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు.

ఆసుపత్రి తనిఖీ



ఆసుపత్రిలోని బ్లాకులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

మదనపల్లె : స్థానిక సర్వజన బోధన ఆస్పత్రి, ఆరోగ్యవరంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాలను సోమవారం ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు, ఇంజనీరింగ్ బృందం తనిఖీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు ఆదేశాలతో ఎండీ పీఎస్.గిరీషా, చీఫ్ ఇంజనీర్ సుధాకరరెడ్డి, ఏపీ ఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కమిటీ సభ్యులు మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలో మెడికల్ కాలేజీ తరగతుల నిర్వహణకై నిర్మించిన వివిధ బ్లాకులను పరిశీలించారు. ప్రస్తుతం సర్వజన బోధన ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న భవనాల ఫొటోలు, వీడియోలను తీయించారు. కాంట్రాక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కాలేజీలో జరిగిన పనుల నాణ్యత ప్రమాణాలు, మెడికల్ కాలేజీ తరగతుల నిర్వహణకై అవసరమైన సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉన్నాయా? లేదా? అనే అంశంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.